క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో బంగారు అంగళ్ల వీధికి సంబంధించి లైన్ వర్క్ జరుగుతున్న సందర్భంగా డిగ్రీ కళాశాల రోడ్డు, కృష్ణుని టెంపుల్, కొత్తగా నిర్మిస్తున్న ఆర్డీఓ కార్యాలయ సమీప ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్, తదితరులు

వేంపల్లె : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ సంధ్యారాణి తెలిపారు. శనివారం కడపలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ ఎంపిక కావడం పట్ల డైరెక్టర్‌తో పాటు ఏవో రాంభూపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు వెంకటరమణారెడ్డి, శంషాద్ బేగం, బాలఓబయ్యలు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వేంపల్లె : శ్రీసత్యసాయి సేవా సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో భాగంగా ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిబుల్‌ఐటీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శనివారం ఆ క్యాంపస్‌లో డైరెక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నేచర్ ఇజ్ ద బెస్ట్ ఫీచర్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ట్రిబుల్‌ఐటీలో ఇంటర్ చదువుతున్న 304 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వేంపల్లి సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు అర్బన్ సీఐగా కరుణాకర్

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు అర్బన్ సీఐగా కరుణాకర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సదాశివయ్యను ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో జట్టుకు ఇంద్ర ఎంపిక



ముద్దనూరు : రాష్ట్రస్థాయి ఖో-ఖో జట్టుకు ముద్దనూరు యువకుడు ఎంపికయ్యాడు. యోగివేమన విశ్వవిద్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన ఇంద్ర రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు స్థానిక ఫిజికల్ డైరెక్టర్ మాధవరెడ్డి తెలిపారు. ఈనెల 20నుంచి చిత్తూరు జిల్లా యాదమర్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ రాక

కమలాపురం : పట్టణంలో ఆదివారం జరిగే పార్టీలో చేరిక కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువనేత ఇస్మాయిల్ ఆధ్వర్యంలో 16వ మున్సిపల్ వార్డులో అత్యధికంగా, అలాగే 15, 17, 19, 2వ వార్డు నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లీనిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి రానున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

చర్చి నిర్మాణానికి స్టీల్ వితరణ

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి ఆదివారం స్టీల్‌ను వితరణ చేయనున్నట్లు మండల కన్వీనర్ గూడాప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల నాయకులుపాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేటి నుంచి దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు



వేంపల్లెలో ముస్తాబైన దేవస్థానం



పులివెందులలో ముస్తాబయిన శ్రీవేంకటరమణుడి ఆలయం



విద్యుత్ దీపకాంతుల నడుమ ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు

పులివెందుల టౌన్ : పట్టణంలో దసరా శరనవరాత్రుల మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. దసరా మహోత్సవాలలో భాగంగా ఆలయాల్లో అమ్మవారు రోజుకో దివ్యరూప అలంకారాలతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారిశాలలో ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. స్థానిక అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి శరన్నవరాత్రులలో మొదటిరోజు గణేశ గోప్రార్థన పంచగవ్యం, రక్షాబంధనం, సర్వదేవతా ఆహ్వాన కలశస్థాపం చేయనున్నారు. అదేరోజు సాయంత్రం అమ్మవారు శ్రీబాలత్రిపుర సుందరీదేవి అలంకారంతో దర్శనమివ్వనున్నారు. 9రోజులపాటు రోజుకో అలంకారాలలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రవికుమార్ తెలిపారు. అలాగే అంకాలమ్మ ఆలయంలో దేవిశర నవరాత్రుల ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్, ఈఓ రమణలు తెలిపారు. అలాగే పట్టణం నడిబొడ్డులో ఉన్న వేంకటరమణుడి ఆలయంలో దేవీశరనవరాత్రుల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు తెలిపారు. స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయ రాజగోపురాన్ని విద్యుత్ దీపకాంతులతో ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేదుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి తెలిపారు. అలాగే మారుతీహాల్ వీధిలోని చౌడమ్మ అమ్మవారి ఆలయంలో దేవిశరన్నవరాత్రుల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు వివిధ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించి తరించాలని నిర్వాహకులు కోరారు.

ముస్తాబైన కన్యకాపరమేశ్వరి దేవస్థానం

వేంపల్లె : 118 సంవత్సరాలు చరిత్రగల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో 2023 దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఆలయంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవ ఉత్సవాలకు ఆలయం ముస్తాబైనట్లు తెలిపారు. ఈనెల 15వ తేదీ దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆలయంలో ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలంకరణ, ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, పట్టణ పురవీధుల్లో అమ్మవారి విద్యుత్ కటౌట్లు, క్యాలైన్లు, తదితర ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వాసవిమాత ప్రతీరోజు ఒక్కో దేవతా రూపంలో భక్తులకు దర్శనమీయనున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో దసరా కన్వీనర్లు ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవి కల్యాణ మండపం, ఆవోపా, ఆర్యవైశ్య మహిళా మండలి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలకు కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డికి వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. అలాగే పలువురు ప్రముఖులను ఆహ్వానించామని తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : దసరా ఉత్సవాలను ఆలయ ధర్మకర్తలు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం నుంచి దసరా నవరాత్రులు ప్రారంభం అవుతుండటంతో ఆలయాలన్ని విద్యుత్ దీపాలతో పూర్తిగా అలంకరించారు. అంబభవాని, శ్రీ కన్యాకపరమేశ్వరి, శ్రీచౌడేశ్వరిదేవి ఆలయాలలో ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలతో పూజలు ప్రారంభం కానున్నాయి.

ముద్దనూరులో..

ముద్దనూరు : దసర శరన్నవరాత్రుల మహోత్సవాలు స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. నవరాత్రి అలంకారాల్లో భాగంగా అమ్మవారు ప్రతిరోజూ ఓ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 15న దీక్షా బంధన అలంకారము, 16న శ్రీపార్వతీదేవి అలంకారము, 17న శ్రీ భవానిదేవి అలంకారము, 18న శ్రీమీనాక్షిదేవి అలంకారము, 19న శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారము, 20న శ్రీ సరస్వతిదేవి అలంకారము, 21న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారము, 22న శ్రీ మహిషాసురమర్ధిని అలంకరాము, 23న శ్రీ గజలక్ష్మిదేవి అలంకారము, 24న శ్రీ విజయలక్ష్మిదేవి అలంకారము, 25న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి అలంకారములలో అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక పరమట వీధిలోని రామలింగ చౌడేశ్వరీదేవి, బ్రాహ్మణ వీధిలోని వాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయాలలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని ఆలయ కమిటీ ఆవ్హానించింది. శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో 15న శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారంతో మొదలై 24న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అలంకారంతో డోలాది రోహణతో ముగియనుందన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా



చెన్నూరులో చలువ పందిరితో ముస్తాబైన ఆలయప్రాంగణం

ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేని ఆహ్వానించిన వారిలో సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామమూర్తి, జగన్నాథం, రామాంజనేయులు ఉన్నారు.

శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆహ్వానం

కమలాపురం : పట్టణంలో వెలసిన శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు రావాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డిలను ఆహ్వానించారు. ఈనెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్న ఈ మహోత్సవాలకు హాజరు కావాలని వారు శనివారం రాత్రి కడపలోని ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ కార్యాలయాలకు వెళ్లి ఆహ్వానించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలో దేవి నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం అవుతుండటంతో శనివారం ఉదయం కౌన్సిలర్ గౌరీనాథ్ రావు ఆధ్వర్యంలో భావసార క్షత్రియుల సంఘ పెద్దలు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిని ఆహ్వానించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో జరగబోవు దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలకు రావాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డికి ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు.

చంద్రబాబును కంటికిరెప్పలా చూసుకుంటున్నారు

పులివెందుల రూరల్ : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును ప్రభుత్వం కంటికి రెప్పలా చూసుకుంటోందని మున్సిపల్, మార్కెట్‌యార్డు చైర్మన్‌లు వరప్రసాద్, చిన్నప్పలు అన్నారు. శనివారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చంద్రబాబునాయుడును హతమార్చేందుకు వారి కుటుంబ సభ్యులే కుట్ర చేస్తున్నారన్నారు.

చంద్రబాబునాయుడు బెయిలు, జైలుకు వెళ్లడం పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కానీ, వైఎస్సార్సీపీ పార్టీకీ గానీ ఎటువంటి సంబంధం లేదన్నారు. చంద్రబాబునాయుడు నిర్దోషి అయితే కోర్టులో నిరూపించుకుని బయటికి రావాలి కానీ, ఇలా ఆరోగ్యం సరిగాలేదని నాటకాలు ఆడి బయటికి రావాలనుకోవడం సమంజసం కాదన్నారు. కాగా వైఎస్ భాస్కర్‌రెడ్డి ఆరోగ్యంపై బీటెక్ రవి అవాస్తవాలను కావాలనే మాట్లాడుతున్నారన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి ఆరోగ్యంపై తెలంగాణా ప్రభుత్వం ఇచ్చినటువంటి నివేదిక ఆధారంగానే కోర్టులు బెయిల్ మంజూరు చేశాయన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డికి వెన్నముకకు ఆపరేషన్ చేశారని, ఆరోగ్య సమస్యల వల్ల జడ్జికి వివరించడం పట్ల ఆయనకు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కడపలో ప్రజాదర్బార్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు.

శనివారం రవీంద్రనగర్‌లోని యూఎస్ ఫంక్షన్ హాలులో వక్ఫ్ బోర్డు చైర్మన్ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, 'స్పందన', 'గడప గడపకు మన ప్రభుత్వం', జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలన్నీ ప్రజా సమస్యలు తీర్చేందుకేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

మాదిగల మహాసంగ్రామం కరపత్రాలు విడుదల

ముద్దనూరు : ఈనెల 18వ తేదీన కర్నూలులో జరిగే మాదిగల కురుక్షేత్ర మహాసంగ్రామం కరపత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం విడుదల చేశారు. స్థానిక పాత బస్టాండు ఆవరణలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ఈ మహాసంగ్రామం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మార్పీయస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మండెం లక్ష్మీనరసింహుడి ఆలయానికి మహర్దశ

చిన్నమండెం : మండలంలోని మాండవ్యా నది తీరాన వెలసిన మండెం రాయుడిగా ప్రసిద్ధికెక్కి తాళ్లపాక అన్నమాచార్యులుచే ఆరాధించబడిన శ్రీమండెం లక్ష్మీ నరసింహస్వామికి ఎనిమిదో శతాబ్దంలో చోళులు ఆలయ నిర్మాణం చేపట్టారు. తర్వాత శ్రీ కృష్ణదేవ రాయ పాలనలో ఆలయం చుట్టూ ప్రాంగణాన్ని గోపురాలు రూపుదిద్దుకొని ఈ ప్రాంత భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. పాడుబడిపోతున్న ఆలయాన్ని జీర్ణోద్ధరణతో ఆలయ రూపురేఖలను మార్చాలని స్థానికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, ప్రజల విన్నపం మేరకు రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రూ. 1.50 కోట్లను మొదటి విడతగా మంజూరు చేయించారు.

విద్యాశాఖ రిసోర్స్ పర్సన్‌కు ప్రధాని ప్రశంసాపత్రం

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులుకు భారత ప్రధాని నరేంద్రమోదీ నుంచి ప్రశంసలు లభించాయి. విద్యార్థులకు పరీక్షలపై అవగాహన, భయం లేకుండా రాయడం లాంటి విషయాలపై పరీక్షా పే చర్చా-2023 కార్యక్రమంలో ప్రధానమంత్రి విద్యార్థులతో ముఖాముఖి చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అనుభవజ్ఞులు, నిపుణులు అయిన ఉపాధ్యాయుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ మేరకు గునిశెట్టి శ్రీనివాసులు ప్రధాని కార్యాలయం నుంచి వ్యక్తిగతంగా రిజిస్టర్ పోస్టు ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈయన పెండ్లిమర్రి మండలం ఎగువపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గతంలో ఈయన 2021-22 బడ్జెట్‌పై సూచనలు ఇచ్చినందుకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు. ఆయనను ఉపాధ్యాయులతోపాటు విద్యా శాఖ అధికారులు అభినందించారు. ప్రధానమంత్రి నుంచి లభించిన ప్రశంసాపత్రం తనకు అత్యంత విలువైనదని గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు.

యువతి అదృశ్యం

మూడు గంటల్లో ఛేదించిన పోలీసులు

నందలూరు (రాజంపేట) : పొత్తపి గ్రామానికి చెందిన సాయి తేజ అనే యువతి ఈనెల 13వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఫిర్యాదు అందుకున్న పోలీసులు యువతి ఆచూకీ మూడు గంటల్లో ఛేదించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన శనివారం నందలూరు పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. యువతి తండ్రి నరసింహులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి కేసు నమోదు చేసి మూడు గంటల వ్యవధిలో నెల్లూరులో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి యువతిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొని వ్యక్తి మృతి

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొనడంతో యర్రబోగుల సుబ్రమణ్యం అలియాస్ సురేష్(37) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రైల్వేకోడూరు వీపీఆర్ కండ్రిక జె. శెట్టి పల్లి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం ఏపీఎండీసీ నర్సరీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై రైల్వేకోడూరుకు బయలుదేరాడు. మంగంపేట జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీ కనిపించక పోవడంతో వేగంగా ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

స్కూటర్లు ఢీ : ఒకరు మృతి



ప్రమాదంలో మృతి చెందిన పి. నాగేంద్ర

సంబేపల్లె : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఎర్రగుంట్ల బస్టాప్ సమీపంలో శనివారం రాత్రి రెండు స్కూటర్లు ఢీ కొని పి.నాగేంద్ర (28) మృతి చెందగా అశోక్, భార్య అంజలిలు గాయపడ్డారు. పోలీసుల వివరాలు మేరకు మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లి పంచాయతీ ముదినేని వడ్డిపల్లికి చెందిన పి.నాగేంద్ర రాయచోటి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మోటకట్ల పంచాయతీ చెరువు ముందరపల్లికి చెందిన అశోక్ (40), ఆయన భార్య అంజలి ద్విచక్ర వాహనంలో రాయచోటికి వెళ్తుండగా మార్గమధ్యంలోని ఎర్రగుంట్ల బస్టాప్ సమీపంలోకి రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడ్డ అశోక్, అంజలిలను 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నాగేంద్రకు భార్య, కుమార్తె ఉన్నారు.

విద్యార్థుల హక్కులను కాలరాయడం తగదు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులకు దసరా సెలవులు ఇవ్వకుండా జిల్లాలో ఉన్న కొన్ని కార్పోరేట్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల స్వేచ్ఛను హరింప చేస్తున్నారని పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు గణేష్ అన్నారు. శనివారం కడప ప్రగతి నర్సింగ్ హోంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ నిబంధనల ప్రకారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు దసరా సెలవులు ఇచ్చారన్నారు.

పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి

ఎర్రగుంట్ల : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాలెపాడు గ్రామానికి చెందిన మేకల వీర భాస్కర్ రెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నియమించడంతో అతనికి నియామక పత్రాన్ని ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో 175 స్థానాలలో అత్యధిక మేజార్టీతో గెలవడం ఖాయమన్నారు. జమ్మలమడుగులో కూడా అధిక మేజార్టీతో గెలిపించాలన్నారు. జిల్లా కార్యదర్శి వీరభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కడప మేయర్ సురేష్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వీర భాస్కర్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

పేదలందరికీ సంక్షేమ పథకాలు

కడప కార్పొరేషన్ : ప్రజా సంక్షేమం కోసమే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 29వ డివిజన్‌లోని రహమతుల్లా స్ట్రీట్ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా షేక్ రుక్సానా అనే మహిళ మాట్లాడుతూ తనకు జగనన్న ప్రభుత్వంలో రూ.9.27లక్షలు లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. పర్వీన్ బేగం అనే మహిళ మాట్లాడుతూ గతంలో వృద్ధాప్య పింఛన్ కోసం దూరా బారం వెళ్లే వారమని ఇప్పుడు వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారని హర్షం వ్యక్తం చేసింది. అప్సర్ అనే మహళ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, అమ్మఒడి, ఇంటి స్థలం పథకాల ద్వారా తమకు రూ.8.50లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 29వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ రిజ్వాన్, ఇన్‌చార్జి డిష్ జిలాన్, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, రామమోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, బంగారు నాగయ్య, ఇలియాస్, సుబ్బారెడ్డి, అక్రమ్, గయాజ్, పత్తిరాజేశ్వరి, మూలే సరస్వతి, వెంకట సుబ్బమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

ఆర్టీసీ ఉద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం సరికాదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో మేనేజర్ ఆర్టీసీ ఉద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం సరికాదని ఎన్ఎంయూఏ కడప డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు, రీజినల్ సంయుక్త కార్యదర్శి దాస్‌లు తెలిపారు. శనివారం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిని కలిసి డిపో మేనేజర్ తీరుపై వారు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి సాహసోపేత నిర్ణయం తీసుకుంటే అధికారులు ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. తమ యూనియన్ 23 వేలమంది ఉద్యోగుల సభ్యత్వమున్న అసోసియేషన్ అన్నారు. కడప డిపోలో ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచాల్సిపోయి లేనిపోని కారణాలతో సాకుగా చూపి సర్వీసులను రద్దు చేస్తూ కండక్టర్లు, డ్రైవర్లను అన్ని విధాల ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఈ విషయంగా చైర్మన్ ఆర్ఎంతో ఫోన్‌లో మాట్లాడి రద్దు చేసిన సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు.



ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ కోరారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా స్థాయి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పర్ భద్ర ప్రాజెక్టు వల్ల తుంగభద్ర కు భవిష్యత్తులో నీళ్ల వచ్చే అవకాశం లేదన్నారు. తద్వారా కేసీ కెనాల్ ఆయకట్టు రైతాంగం ఇబ్బందులకు గురవుతారన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలను నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్ మనోహర్ శివకుమార్, ఐఎన్ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్